క్లుప్తంగా

వైభవంగా సాయిబాబా గ్రామోత్సవం



సంగం: స్థానిక సాయినగర్‌లోని సాయిబాబా మందిరంలో జరుగుతున్న గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా శనివారం గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత సాయిబాబాకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఉత్సవమూర్తి పూలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



కొండాపురం: స్థానిక పోలీసుస్టేషన్ నూతన ఎస్సైగా జాజుల మాల్యాద్రి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా పర్చూరు ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు గతంలో ఇక్కడ ఏడాది పాటు పనిచేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఎక్కడైనా కోడిపందేలు, పేకాట వంటి జూదాలు, బెల్టుదుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చేపలకు చికెన్ వ్యర్థాలను వేయడం లేదు

చేజర్ల(ఆత్మకూరు): చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలను ఉపయోగించడంలేదని చేజర్ల మండలం కోటితీర్థంలో చేపలు సాగుచేస్తున్న రైతులు తెలిపారు. కోటితీర్థంలో పొలాల మధ్యన అక్రమంగా చేపలను సాగుచేస్తుండడమే కాకుండా చికెన్ వ్యర్థాలను మేతగా వేస్తుండడంపై అదే గ్రామానికి చెందిన మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా త్రీమెన్ కమిటీ శుక్రవారం పరిశీలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చేపలు సాగుచేస్తున్న రైతులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో చికెన్ వ్యర్థాలు వినియోగించిన మాట వాస్తవమేనని, గత నెలలో పంచాయతీలో సర్పంచ్ చేసిన తీర్మానం మేరకు చేపల వ్యర్థాలను వినియోగించడం లేదని పేర్కొన్నారు. రైతులు పృథ్వీరాజ్, అజయ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులు రాజశేఖర్, రమణయ్య

సీతారామపురం : మండలంలోని గంధంవారిపల్లి సమీపంలోని ఇటుకల బట్టీ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వివరాలు..సీతారామపురం నుంచి గంధంవారిపల్లికి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న నరాల రాజశేఖర్, రమణయ్య ఇటుకల బట్టీ వద్ద జాతీయ రహదారిపై అడ్డుగా వచ్చిన పందిని ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రియల్ మోసగాళ్లపై చర్యలకు వినతి

నెల్లూరు(క్రైమ్): కొందరు రియల్ ఎస్టేట్ పేరిట నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ప్రజలను మోసగిస్తున్నారని, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణగౌడ్ పోలీసు అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన సంఘ నాయకులతో కలిసి వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావుకు శనివారం లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఎంతో కాలంగా నెల్లూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎంతో నమ్మకంగా సాగుతోందన్నారు. ఇటీవల కొందరు వ్యాపారంలోకి ప్రవేశించి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘ నాయకులు దినేస్, కె.శ్రీనివాసులు, జె.అవినాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'పెరసం' వార్షికోత్సవం

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో పెన్నా రచయితల సంఘం (పెరసం) 16వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు పాయల మురళీకృష్ణ(గచ్చెంపెట్టుకి అటూ ఇటూ), మిరప మహేష్(పడమటిదీ నాటకం)లను సన్మానించారు. అనంతరం 'పెరసం' పురస్కారాలను అందజేశారు. పలు రచనలపై సమీక్ష చేపట్టారు. కార్యక్రమంలో కేంద్ర బాలసాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, సుంకర గోపాల్, పెళ్లూరు సునీల్, చిన్ని నారాయణరావు, 'పెరసం' అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజు సుభద్రాదేవి, తోట సులోచన, అవ్వారు శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

వనం వీడి జనావాసాల్లోకి..

దాహార్తితో వస్తున్న వన్యప్రాణులు

- కుక్కల దాడిలో కొన్ని
- వాహనాలు ఢీకొని మరికొన్ని మృత్యువాత
- నిద్రమత్తు వీడని అటవీ సిబ్బంది
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వన్యప్రాణుల ప్రేమికులు



పెంచలకోన అభయారణ్యంలో సంచరిస్తున్న చిరుత

ఉదయగిరి: మనిషికి ఉన్నట్లే వన్యప్రాణులకు కూడా స్వేచ్ఛగా జీవించే హక్కును చట్టప్రకారం ప్రభుత్వం కల్పించింది. అయితే ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలో అటవీ విస్తీరణం తగ్గిపోవడం ..కొన్ని ప్రాంతాల్లో దాహార్తిని తీర్చుకునేందుకు నీటి వసతి లేక వన్యప్రాణులు వనాలను వీడి జనావాసాల్లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో కుక్కల దాడిలో కొన్ని, వాహనాలు ఢీకొని మరికొన్ని వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. ముఖ్యంగా ఆత్మకూరు, ఉదయగిరి, వెంకటగిరి, రాపూరు అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు మైదాన ప్రాంతాలకు వచ్చి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరుచూ జరుగుతున్నాయి. వన్యప్రాణులపై నిరంతరం నిఘా ఉంచి సంరక్షించాల్సిన అటవీశాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో చాలా మంది అటవీ అధికారులు, సిబ్బంది తమ స్వలాభాలపై పెట్టిన దృష్టి, మూగ జీవాల సంరక్షణపై పెట్టడం లేదనే ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి.

వేసవి వచ్చిందంటే..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉదయగిరి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధితో పాటు పెంచలకోన, వెంకటగిరి ప్రాంతాలను కలుపుకొని సుమారు 1.57 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతంలో చిరుతలు, జింకలు, దుప్పిలు, నెమళ్లు, నక్కలు, ఎలుగుబంట్లు తదితర వన్యప్రాణులు ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది వేసవి నుంచి ఇప్పటి వరకు అటవీ ప్రాంతంలో తగిన వర్షపాతం లేక తాగునీటి సమస్య తలెత్తింది. అప్పుడప్పుడు తగిన నీరు దొరక్క, ఆహారం కోసం వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి. ముఖ్యంగా అటవీ సమీప గ్రామాల్లోకి దుప్పులు, జింకలు దాహార్తి తీర్చుకునేందుకు వస్తూ కుక్కల దాడిలో మృత్యువాత పడుతున్నాయి. ఈ వేసవిలో ఉదయగిరి, మర్రిపాడు, రాపూరు అటవీ ప్రాంతాల నుంచి దాహార్తి తీర్చుకునేందుకు వచ్చిన జింకలు, దుప్పులు ఐదు వరకు మృత్యువాత పడగా, మరో పదింటిని స్థానికులు కాపాడి అటవీ అధికారులకు అప్పగించారు. తాజాగా బండగానిపల్లి రోడ్డు మార్గంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని నక్క మృత్యువాత పడింది. అలాగే దుర్గంపల్లి బీట్ పరిధిలో ఉదయగిరి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఓ దుప్పి జనారణ్యంలోకి వచ్చి కుక్కల దాడిలో మృత్యువాత పడింది. మూడ్రోజుల క్రితం ఉదయగిరి దుర్గం ప్రాంతం నుంచి జనావాసంలోకి వచ్చిన దుప్పిపై కుక్క దాడి చేయగా స్థానికులు కాపాడారు. ఏడు నెలల క్రితం మర్రిపాడు–బద్వేలు రోడ్డు మార్గంలో కదిరినాయుడుపల్లి వద్ద చిరుతను గుర్తుతెలియని వాహనంను ఢీకొట్టినట్లు వార్తలు వచ్చాయి. పెంచలకోన అభయారణ్యంలో గ్రామ సమీపంలోకి వచ్చిన నెమళ్లు వేటగాళ్ల బారిన పడి మృత్యువాత పడుతున్న ఘటనలు ఉన్నాయి.



ఇటీవల ఉదయగిరి సమీపంలో కుక్కల దాడిలో చనిపోయిన దుప్పి

నిద్రమత్తు వీడని అటవీ సిబ్బంది

ఉదయగిరి రేంజ్ పరిధిలో సీతారామపురం, ఉదయగిరి తూర్పు,పడమర, కృష్ణంపల్లి, దుత్తలూరు సెక్షన్ల పరిధిలో అటవీ జంతువుల సంచారం ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతంలో ఎక్కడో ఒక చోట నిత్యం వన్యప్రాణులు అటవీ సమీప గ్రామాలకు దాహార్తి కోసమో...ఆహారం కోసమో వస్తుంటాయి.వీటిలో కొన్ని కుక్కల దాడిలో చనిపోతున్నాయి.మరికొన్ని పంట పొలాలకు రైతులు పెట్టే విద్యుత్ కంచెలను తగిలి చనిపోతున్నాయి. వీటిని ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా అటవీ సిబ్బంది పెద్దగా పట్టించుకోవడం లేదు. కొన్ని చోట్ల మామూళ్లు తీసుకుని కేసులు లేకుండా వదిలివేస్తున్నారు. వన్యప్రాణుల సంచారంపై నిరంతరం నిఘా పెట్టాల్సిన అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తమ విధులను మరిచి స్వలాభాలపై దృష్టి పెడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

వన్యప్రాణులు జనంలోకి వచ్చి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరుచుగా జరుగుతున్నాయి. వన్యప్రాణుల సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించి ప్రతిఒక్కరూ జనావాసాల్లోకి వచ్చిన వాటిని కాపాడాలి. అడవుల్లో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అటవీ ప్రాంతంలో రోడ్లను నిర్మించే సమయంలో వన్యప్రాణులు దాటేందుకు వీలుగా బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించాం.

– మహబూబ్‌బాషా,డీఎఫ్‌ఓ

కనులపండువగా వేణుగోపాలుని రథోత్సవం

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలోని వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం నిత్యహోమం, బలిహరణ, అశ్వవాహనోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేణుగోపాలుని ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి గ్రామోత్స వం జరిపారు. గ్రామానికి చెందిన యువకులు రథాన్ని లాగి స్వామి అనుగ్రహం పొందారు. కాగా బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం అభిషేక పూజలు, చక్రస్నానం, పుష్పయాగం, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

పాలవ్యాన్‌ను ఢీకొన్న స్కూటీ

- వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన సుబ్బరాజు

సంగం: మండలంలోని తరుణవాయి సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..ర్యాంపునకు చెందిన సుబ్బరాజు స్కూటీపై సంగం వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో తరుణవాయి సమీపంలో ఆగి ఉన్న పాలవ్యాన్‌ను అదుపుతప్పి ఢీకొన్నాడు. ఈ ఘటనలో సుబ్బరాజు తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి పవిత్రోత్సవాలు



సోమశిల: అనంతసాగరంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మూడు రోజులుగా పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్నిధ్యానం, హోమం, కుంభార్చన, విశేష హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి అగ్ని ధ్యానం, కుంభార్చన, మహాశాంతి హోమం నిర్వహించారు. కాగా చివరిరోజైన ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. తిరుపతికి చెందిన కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించనున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆలయ అర్చకులు భానుప్రకాష్ తెలిపారు.

దుర్గంపల్లి వీఎస్‌ఎస్ చైర్మన్ ఎన్నిక వాయిదా



అధికారులను నిలదీస్తున్న సభ్యులు

ఉదయగిరి: మండలంలోని దుర్గంపల్లి ఎస్సీ కాలనీ వనసంరక్షణ సమితి(వీఎస్‌ఎస్)కమిటీ చైర్మన్ ఎన్నిక కోరంలేక వాయిదా పడింది. ఇటీవల వీఎస్‌ఎస్ కమిటీ చైర్మన్ మరణించడంతో నూతన చైర్మన్ ఎన్నిక ప్రక్రియకు నోటిఫికేషన్ జారీ చేశారు. శనివారం ఎస్సీ కాలనీ కూడలిలో ఉదయగిరి వెస్ట్‌సెక్షన్ అధికారి చినవెంకటయ్య,దుత్తలూరు డీఆర్వో మురళి, దుర్గంపల్లి వెస్ట్ బీట్ అధికారి ప్రసన్న, ఫడ్స్ ఎన్‌జీఓ తరఫున వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. వీఎస్‌ఎస్‌లో 60 కుటుంబాలకు చెందిన 120 మంది సభ్యులు ఉండగా, 15 మందితో యాజమాన్య కమిటీ ఏర్పాటు చేశారు. చైర్మన్ ఎన్నిక ప్రక్రియకు కనీసం 50 శాతం మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా పది మంది కూడా హాజరు కాలేదు. దీనికి తోడు యాజమాన్య కమిటీ నుంచి కేవలం ఐదుగురు మాత్రమే హాజరయ్యారు.దీంతో తగిన కోరం లేక ఎన్నిక పక్రియ వాయిదా పడింది. ప్రస్తుతం ఉన్న వీఎస్‌ఎస్ సభ్యుల జాబితాలో సగం మంది వరకు ప్రస్తుతం లేరు. యాజమాన్య కమిటీలో కూడా ఐదుగురు చనిపోయి ఉన్నారు. నూతన చైర్మన్ ఎన్నిక జరపాలంటే ముందుగా చనిపోయిన వారి స్థానంలో వారి వారసులను సభ్యులుగా చేర్చుకోవాలి. యాజమాన్య కమిటీలోని చనిపోయిన వారి స్థానంలో కొత్త వారిని ఎన్నుకోవాలి. ఆ తర్వాత మాత్రమే నూతన వీఎస్‌ఎస్ చైర్మన్ ఎన్నిక చేపట్టాలి. దీంతో అధికారులు తాత్కాలికంగా ఎన్నికను వాయిదా వేసి ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. పై పక్రియను పూర్తి చేసిన తర్వాత నూతన చైర్మన్ ఎన్నికను చేపట్టనున్నట్లు సెక్షన్ అధికారి చినవెంకటయ్య తెలిపారు.

చైర్మన్ ఎన్నికకు రెండు వర్గాలు పోటీ

నూతన చైర్మన్ ఎన్నికకు రెండు వర్గాలు పోటీపడ్డాయి. ఎన్నిక విషయమై రెండు వర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ప్రతి మూడేళ్లకు ఒకసారి చైర్మన్,వైస్‌చైర్మన్ ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే 14 ఏళ్లుగా ఎన్నికలు జరిపించకపోవడంపై అధికారులను సభ్యులు నిలదీశారు. వీఎస్‌ఎస్‌లో తమ రావాల్సిన వాటా నిధుల సంగతి ఏమిటని ప్రశ్నించారు. కానీ అధికారులు నోరు మెదపలేదు.దీంతో పలువురు సభ్యులు అధికారుల తీరుపై మండిపడ్డారు. తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించి చైర్మన్ ఎన్నికను పూర్తి చేయాలని భావించిన అధికారులకు వీలు పడలేదు.

చప్టాపై రక్షణ కరువు



చప్టాపై రక్షణ గోడలు లేక ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు

సోమశిల: అనంతసాగరం నుంచి మర్రిపాడు మీదుగా బద్వేలుకు వెళ్లే మార్గంలో పల్లవోలు సమీపంలోని వాగు చప్టాపై రక్షణ గోడలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చప్టా వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు, లైన్లను ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ ఆటో అదుపుతప్పి వాగులో పడిపోయింది. గతంలోనూ పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కాగా వాగు వద్ద భారీ మలుపు సైతం ఉంది. మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగిపోయి ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో నిత్యం వాహన రద్దీ ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

కిలో పొగాకు సగటు ధర రూ.205

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకుకు సగటు ధర రూ.205 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు వేలానికి 625 బేళ్లను తీసుకురాగా, 532 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.205.78 ధర పలికిందని వివరించారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

కొండాపురం: మండలంలోని సాయిపేట పొలాల్లో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై కొండాపురం, కలిగిరి ఎస్సైలు జే మాల్యాద్రి, ఉమాశంకర్ తమ సిబ్బందితో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 30కుపైగా ద్విచక్ర వాహనాలు, నాలుగు కోళ్లు, రూ.39,050 నగదు స్వాధీనం చేసుకున్నారు.

న్యాయం చేయాలని పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన



పోలీసు స్టేషన్ ఎదుట బైటాయించిన వెంకట్రావుపల్లికాలనీవాసులు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు కౌన్సిలర్ తమపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నాడని, తమకు న్యాయం చేయాలని కోరుతూ వెంకట్రావుపల్లికి చెంది పలువురు టీడీపీ కార్యకర్తలు పోలీసు స్టేషన్ ఎదుట శనివారం బైటాయించి ఆందోళన చేపట్టారు. బాధితుల కథనం మేరకు.. 2వ వార్డు వెంకట్రావుపల్లికి చెందిన కరేటి విజయ్ టీడీపీ కార్యకర్త. ఇటీవల విజమ్ తనకు తెలియకుండా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించడంపై కొత్తగా పార్టీలోకి వచ్చిన కౌన్సిలర్ శివకోటారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ అడ్డుకున్నాడు. దీంతో వారి మధ్యన గొడవలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో మంత్రిని వ్యక్తిగతంగా దూషించాడని విజయ్‌పై కౌన్సిలర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు నాలుగు రోజుల క్రితం విజయ్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి ఒకరోజు అంతా స్టేషన్‌లోనే ఉంచారు. దీంతో మరోవర్గానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్టేషన్‌కు వెళ్లి విజయ్‌ను తీసుకొచ్చారు. అప్పుడే దౌర్జన్యం చేసి దూషిస్తున్నాడని శివకోటారెడ్డిపై విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే నాలుగు రోజులైనా పోలీసులు ఫిర్యాదును పట్టించుకోలేదని, దీన్ని అలుసుగా తీసుకున్న కౌన్సిలర్ రజకులమైన తమను కులం పేరుతో దూషిస్తున్నాడని తమకు న్యాయం చేయాలని బాధితుడు విజయ్‌తో పాటు కాలనీవాసులు స్టేషన్ ఎదుట బైటాయించారు. తమకు న్యాయం జరిగే వరకు కదిలేదిలేదని భీష్మించారు. స్టేషన్‌కు వచ్చిన ఎస్సై ఎస్‌కే జిలానీ వారితో మాట్లాడి విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

వంట చేస్తుండగా వ్యక్తికి గాయాలు

సీతారామపురం : సీతారామపురం సమీపంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే సిబ్బంది కోసం వంట చేస్తున్న క్రమంలో వేడి పప్పుపైన పడడంతో ఓ వ్యక్తి శనివారం తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..హైవే నిర్మాణ పనులు చేస్తున్న వారి కోసం ఎంకులూరి ఎల్లయ్య అనే వ్యక్తి వంట చేస్తున్నాడు. పొయ్యి మీద నుంచి ఉడుకు పప్పును కిందకు దించుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపైన పడడంతో చేతులు, మోకాళ్లు, నడుము, తదితర ప్రాంతాల్లో తీవ్రంగా గాయాలయ్యాయి. బాధితుడిని సహచర సిబ్బంది సీతారామపురం పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విరిగి పడిన విద్యుత్ స్తంభం..తప్పిన ప్రమాదం



దాబా వద్ద విరిగిపడిన విద్యుత్ స్తంభం

దగదర్తి : మండలంలోని ఉలవపాళ్లలో జాతీయ రహదారి పక్కన ఉన్న దాబా వద్ద శనివారం ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఆ సమయంలో విద్యుత్ సిబ్బంది విద్యుత్‌లైన్ల నిర్వహణ పనులు చేపడుతూ సరఫరాను నిలిపివేసి ఉండడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాలు..బోగోలు మండల విద్యుత్ సిబ్బంది ఉలవపాళ్లలోని దాబా సమీపంలో విద్యుత్ తీగలను తగులుతున్న జామాయిల్ చెట్లను నరుకుతుండగా ఓ పెద్ద కొమ్మ విరిగి పడడంతో తీగలు సాగి కిందకు వచ్చాయి. అదే సమయంలో దాబా వద్ద నుంచి జాతీయ రహదారిపైకి వెళ్తున్న భారీ ట్రాలీని తీగలు తగులుకున్నాయి. డ్రైవర్ గమనించక ట్రాలీని ముందుకు కదిలించడంతో దాబా వద్ద ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడింది. దాబా వద్ద ఆగి ఉన్న లారీపై స్తంభం స్వల్పంగా పడడంతో ప్రమాదం తప్పింది.ముందుగానే విద్యుత్ సిబ్బంది సరఫరాను నిలిపివేసి ఉండడంతో ప్రాణాపాయం సైతం తప్పింది. దగదర్తి ఏఈ ఖాజా స్పందించి బోగోలు, దగదర్తి మండలాల విద్యుత్ సిబ్బందితో కలిసి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

ఎఫ్‌పీఓలతో రైతులకు ఆర్థిక పరిపుష్టి

- నాబార్డు డీడీఎం బాబు



ఆత్మకూరు: రైతులతో మాట్లాడుతున్న నాబార్డు అధికారులు

చేజర్ల(ఆత్మకూరు): ఫార్మర్ ప్రొటెక్ట్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ)ల ద్వారా రైతులకు ఆర్థిక పరిపుష్టి కలగనుందని నాబార్డు డీడీఎం డాక్టర్ బాబు అన్నారు. నాబార్డు వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని చేజర్ల మండలం ఎన్‌వీకండ్రికలో శనివారం వేడుకలు నిర్వహించారు. డీడీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాబార్డు ఆధ్వర్యంలో ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో ఎఫ్‌పీఓలో 500 మందికి తగ్గకుండా రైతులు సభ్యత్వం పొందవచ్చునని చెప్పారు. ఎన్‌వీకండ్రిక, ఏటూరు గ్రామాలకు చెందిన రైతులు శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ ఎఫ్‌పీఓను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఎఫ్‌పీఓలోని సభ్యులైన రైతులు షేర్ క్యాపిటల్ చెల్లిస్తే అంతే మొత్తాన్ని నాబార్డు అందజేసి రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు, ఉత్పత్తులను రవాణా చేసుకునేందుకు చిన్నపాటి వాహనాలను సమకూరుస్తుందన్నారు. ఎన్‌వీకండ్రిక ఎఫ్‌పీఓ పరిధిలో నిమ్మ, మినుము, మామిడి, వరి, తదితర రకాలైన పంటలను రైతులు పండిస్తున్నారని, ఆ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు వాహన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎఫ్‌పీఓ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కెనరా బ్యాంకు ఫైనాన్షియల్ లిటరసి రవిశంకర్, ఎఫ్‌పీఓ చైర్‌పర్సన్ తేళ్ల ఆదిశేషారెడ్డి, సీఈఓ జ్ఞానేంద్రరెడ్డి, డైరెక్టర్లు తేళ్ల శేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



బాలుర వసతిగృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అస్మా

ఆత్మకూరు: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్‌కే అస్మా అన్నారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహం, ఏపీ బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు శనివారం ఆమె వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలతో డెంగీ, మలేరియా, బోధకాలు, చికెన్‌గున్యా, తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. విద్యార్థులు దోమతెరలను వాడడం ద్వారా దోమల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవని తెలిపారు. అనంతరం వంటగదులు, మరుగుదొడ్లు, వసతిగదులను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఎంపీహెచ్‌ఈఓ ఎస్ సుధాకర్, ఎంపీహెచ్‌ఏ జి రవీంద్ర, వార్డెన్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణ యత్నంపై నిరసన



సీతారామపురం : అయ్యావారిపల్లి ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ పలువురు స్థానికులు శనివారం నిరసన తెలిపారు. 2002లో అయ్యావారిపల్లిలోని సర్వేనంబర్ 7లోని నాలుగు సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం బొగ్గవరపు రత్నం అనే వ్యక్తికి కేటాయించింది. ఆయన కొంత స్థలంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మిగిలిన స్థలాన్ని అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం ఖాళీగా ఉంచారు. దానిపై కన్నేసిన కొందరు వ్యక్తులు శనివారం ఆక్రమించుకునేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. స్థలం ఆక్రమణకు యత్నించిన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పట్టాదారుడికి కోరిక మేరకు స్థలంలో గ్రామానికి ఉపయోగపడే భవన నిర్మాణాలను చేపట్టాలని కోరారు.